క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా బాలయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న బాలయ్య

నకిరేకల్ : నకిరేకల్ మున్సిపల్ కమిషనర్‌గా డి.బాలయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన మున్సిపల్ కమిషనర్ బాలాజీ రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ గోషామహల్ సర్కిల్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న డి.బాలయ్య ఇక్కడికి వచ్చారు.

కనగల్ తహసీల్దార్‌గా పద్మ



కనగల్ : కనగల్ మండల నూతన తహసీల్దార్‌గా పద్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నార్కట్‌పల్లి మండలంలో పనిచేస్తూ కనగల్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ జ్యోతి మిర్యాలగూడెం ఆర్డీఓ కార్యాలయానికి డీఏఓగా బదిలీపై వెళ్లారు.

మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సరిత



నల్లగొండ టూటౌన్: బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మిర్యాలగూడకు చెందిన కొండేటి సరితను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా సరిత పని చేస్తున్నారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడంతోపాటు మహిళల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. తనను నియమించిన పార్టీ రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

చిట్యాల: మండలంలోని వనిపాకల గ్రామంలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో వ్యవసాయ బోర్లు ఎండిపోయి వరి పంట నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ కోరారు. వనిపాకల గ్రామంలో ఎండిపోతున్న వరి పొలాలను మంగళవారం శ్రవణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించి జిల్లా అధికారులకు నివేదిక అందించి పరిహారం అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అక్బర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె.షరీఫ్, మేకల భిక్షం, గుండాల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి బ్రహ్మోత్సవాలు

కనగల్: మండల పరిధిలోని పగిడిమర్రి గ్రామంలో 70 సంవత్సరాల చరిత్ర గల మద్విరాజ్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. 22న విఘ్నేశ్వర పూజ, మూల విగ్రహాలకు అభిషేకం, అఖండ దీపారాధన, వాస్తుహోమలు, అంకురారోపణ, నవగ్రహ హోమం, మంగళ నీరాజన మంత్ర పుష్పములు 23న పుణ్యాహవాచనం, ఉదయం 8 గంటలకు జమదగ్ని రేణుకాఎల్లమ్మ కల్యాణ మహోత్సవం, బోనాలు 24న రుద్రహోమం, పూర్ణహుతి, శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం, వీరబ్రహ్మేంద్రస్వామి హోమం, గణపతి హోమం 25న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం వేదపండితులు, మంత్రోచ్చరణ మధ్య వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కల్యాణం అనంతరం సాయంత్రం రథోత్సవం ఉంటుందన్నారు. 26న అగ్నిగుండాల అనంతరం బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అన్వేష్‌రెడ్డికి కార్పొరేషన్ పదవి ఇవ్వాలి

కేతేపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల పక్షాన పోరాటాలు చేసిన కాంగ్రెస్ పార్టీ కిసాస్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకేట అన్వేష్‌రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. మంగళవారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా రైతుల పక్షాన ఉద్యమాలు నిర్వహించి పోలీసుల లాఠీల దెబ్బలు తిన్న అన్వేష్‌రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశాడని అన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి

కేతేపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీసీసీ మైనార్టీసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. మద్దతు ధర, రుణ విమోచన చట్టం, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.

తీరనున్న తాగునీటి తిప్పలు

- కొత్త మోటార్లకు రూ.1.30 కోట్లు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డి
- ఆరు మోటార్ల కొనుగోలుకు మున్సిపాలిటీ నిర్ణయం
- టెండర్లు పిలిచిన మున్సిపల్ యంత్రాంగం



మున్సిపాలిటీ పంప్ హౌజ్



మున్సిపాలిటీ నీటి శుద్ధి కేంద్రం



నీటిశుద్ధి కేంద్రంలోని మోటార్లు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణ ప్రజలకు వేసవిలో తాగు నీటి ఇబ్బందులు రాకుండా మున్సిపాలిటీ ముందస్తు చర్యలు చేపడుతోంది. పానగల్‌లోని మున్సిపాలిటీ పంప్‌హౌజ్ వద్ద ప్రస్తుతం ఉన్న మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో కొత్త మోటార్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ అధికారులతో ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమావేశం నిర్వహించి తాగు నీటి సమస్యపై సమీక్షించారు. కొత్త మోటార్ల ఆవశ్యకత, తాగు నీటి ఇబ్బందులు, నిధుల లేమి సమస్యను వారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన మంత్రి వేసవిలో తాగు నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మోటార్లు కొనుగోలు కోసం వెంటనే తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.1.30 కోట్లను విడుదల చేశారు. నాణ్యమైన మోటార్లు కొనుగోలు చేసి మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో తాగు నీటి సమస్య రాకుండా అన్ని ముందుస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దీంతో మున్సిపల్ అధికారులు వెంటనే మోటార్ల కొనుగోలుకు టెండర్ల ప్రక్రియ చేపట్టారు.

ఆరు మోటార్ల కొనుగోలుకు టెండర్లు..

పానగల్‌లోని పంప్ హౌజ్‌లో ఏడాది కాలంగా మోటార్లు తరచూ మరమ్మతులకు గురికావడంతో తాగు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతోంది. పాత మోటార్లు పనికి రావని నిర్ధారణ అయిన తరువాత ఆరు మోటార్లు కొనుగోలుకు మున్సిపల్ అధికారులు టెండర్లు పిలిచారు. ఈ నెలాఖరులోగా కొత్త మోటార్లు కొనుగోలు చేసి పంప్‌హౌజ్‌లో బిగించనున్నారు. కొత్త మోటార్ల బిగింపు పూర్తయిన తరువాత అక్కడ విద్యుత్ సరఫరాలో అంతరాయం జరగకుండా అధికారులు దృష్టి సారిస్తే వేసవిలో తాగు నీటి సమస్య నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

ఆరు మోటార్లు కొనుగోలు చేస్తున్నాం



తాగు నీటి సమస్యపై ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్షించారు. మోటార్ల సమస్య ఉందని చెప్పడంతో కొత్త మోటార్ల కొనుగోలుకు రూ.1.30 కోట్లు మంజూరు చేశారు. నీటి సమస్య రాకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. మోటార్ల కొనుగోలుకు నిధులు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్

సమయానికి బస్సులు నడపాలని ధర్నా



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

చండూరు : పాఠశాలల సమయానికి అనుకూలంగా బస్సులు నడపాలని కోరుతూ మంగళవారం చండూరు మండలంలోని కొండాపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు లెనిన్, గడ్డం నవీన్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో ఉదయం 8:30 నుంచి 11:30 సమయం వరకు ఒక్క బస్సు కూడా రాకపోవడంతో కాలినడకన పాఠశాలలకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచి, విద్యార్థుల సమయానికి అనుకూలంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు మేఘన, జాహ్నవి, సౌమ్య, అనూష, లావణ్య, ఆకాంక్ష, చరణ్, నిశాంత్, ధనలక్ష్మి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

విజయసంకల్ప యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

చిట్యాల: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరుతూ చేపట్టనున్న విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి కోరారు. భువనగిరి నుంచి సికింద్రాబాద్ వరకు చేపట్టనున్న భాగ్యలక్ష్మీ క్లస్టర్ విజయ సంకల్ప యాత్ర ప్రచార పోస్టర్‌ను చిట్యాలలో మంగళవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. అనంతరం ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నకిరేకంటి మొగులయ్యను బీజేపీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, చిట్యాల పట్టణ అధ్యక్షుడు కూరెళ్ళ శ్రీను, మండల రూరల్ అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహగౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి గంజి గోవర్ధన్, మల్లేష్, జిట్ట విష్ణుపాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని సుంకెనెపల్లి గ్రామంలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర ప్రచార పోస్టర్‌ను బీజేవైఎం జిల్లా నాయకుడు చెన్నోజు సాయికిరణ్ విడుదల చేశారు. కార్యక్రమంలో బుంగ రాజేందర్, వంశీచరణ్, సాయికుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలి



కేతేపల్లి: ఈ కేవైసీ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ రామారావునాయక్

కేతేపల్లి: పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న రైతులందరూ విధిగా ఈ కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయశాఖ నకిరేకల్ ఏడీఏ రామారావు నాయక్ సూచించారు. కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్న ఈ కేవైసీ నమోదును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 364 మంది రైతులు ఇంకా పీఎం కిసాన్ ఈ కేవైసీ నమోదు చేయించుకోలేదని తెలిపారు. అలాగే 250 మంది రైతులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయించుకోలేదన్నారు. ఈ కేవైసీ చేయించుకోని రైతులు గ్రామాలకు వస్తున్న ఏఈఓలను సంప్రదించాలన్నారు. దీంతో పాటు మీ సేవ, కామన్ సర్వీస్ సెంటర్‌లకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీ చేయించుకోనివారు పీఎం కిసాన్ లబ్ధి పొందలేరని తెలిపారు. ఏడీఏ వెంట ఏఓ బి.పురుషోత్తం, ఏఈఓలు బాలరాజు, ఉమేష్, వీరేష్ తదితరులు ఉన్నారు.

ఈ కేవైసీని త్వరితగతిన పూర్తి చేయాలి

మర్రిగూడ: లబ్ధిదారులు ఈ కేవైసీ రేషన్ డీలర్లు త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఈ నెల చివరి వరకు అవకాశం కల్పించిందని, గడువులోపు లబ్ధిదారుల వేలిముద్రలను తీసుకోవడం పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు బషీర్‌అలీ, పాండురంగారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి కల్యాణం



కట్టంగూర్ : కల్యాణంలో పాల్గొన్న భక్తులు



నకిరేకల్ : ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశాన్ని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కట్టంగూర్ : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని మంగళవారం ఆలయ పూజారి రామడుగు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డిపల్లి మనోహర్, కమిటీ సభ్యులు మీలా వేణుమాధవ్, కోమటి భాస్కర్, ఇల్లెందుల గోపి, ఓరుగంటి రమేష్, బండారు అరుణ్, గండు వెంకన్న, రెడ్డిపల్లి సైదులు, చెరుకు వెంకన్న, బత్తిని సత్తయ్య, అంజయ్య, సంధ్య, కడారు కృష్ణవేణి, కొంపెల్లి మంగమ్మ, దోరెపల్లి పద్మ, మీలా పావని, కొత్త శోభ భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా స్తంభగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

మర్రిగూడ: మండల పరిధిలోని సరంపేట గ్రామంలోగల శ్రీ స్తంభగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మారెపల్లి వెంకటాచార్యులు, ఆలయ ధర్మకర్త మారెపల్లి నర్సింహాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ మద్భగవద్గీతా మందిర 26వ వార్షిక బ్రహ్మోత్సాలు మంగళవారం ముగిశాయి. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముగింపు వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నేత దైద రవీందర్, మందిర అధ్యక్షుడు పబ్బతి వెంకన్న, ఉపాధ్యక్షుడు మంచుకొండ సోమయ్య, ప్రధాన కార్యదర్శి కొత్తురు వెంకటేశ్వర్లు, సోమ గీత, కందాల శ్రీనివాస్‌రెడ్డి, వీరవెల్లి రాగ కవిత, పున్న విజయలక్ష్మీ, గుండా వెంకటయ్య, ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయంతో కుండల ఏర్పాటు

చండూరు(గట్టుప్పల్): గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల దహార్తి తీర్చేందుకు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం నాయక్ దాతల సహాయంతో కుండలు ఏర్పాటు చేయించారు. అదేవిధంగా ఆ కుండల్లో ప్రతిరోజు ప్యూరిఫైడ్ వాటర్ పోయించేందుకు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ప్రతి 15 నిమిషాలకు ఓసారి విద్యార్థులకు నీటిని తాగించేందుకు ఉపాధ్యాయులు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా దాతలు పోలగోని చంద్రశేఖర్, పోలోజు శంకరాచారిలను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు వి.సాయిరామ్, నరసింహ, రాణి, మల్లేశం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

22న ఓపెన్ ఫోరం

కనగల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కనగల్ మండల వ్యాప్తంగా ఉన్న 31 గ్రామాల్లో 01-03-2022 నుంచి 31-03-2023 వరకు జరిగిన పనులపై ఈ నెల 22న 13వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయరాం, ఏపీఓ సుధాకర్ మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగనున్న ఓపెన్ ఫోరంకు కూలీలు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆధార్ సెంటర్ ప్రారంభం



ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మర్రిగూడ: మండల కేంద్రంలో నాలుగు నెలలకు పైగా ఆధార్ సవరణలు, నమోదుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో గత నెల 29న సాక్షి దినపత్రికలో 'ఆధార్ నమోదుకు తప్పని తిప్పలు'అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సోమవారం ఆధార్ కేంద్రాన్ని పునః ప్రారంభించారు. మంగళవారం నుంచి మండల ప్రజలు మర్రిగూడలో ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. మండల కేంద్రంలో పూర్తిస్థాయిలో ఆధార్ కేంద్రం సేవలు అందుబాటులోకి వచ్చేవరకు కొండమల్లేపల్లి మండలంలో విద్యాశాఖపరంగా ఆధార్ సేవలను తాత్కాలికంగా కొనసాగనున్నట్లు తహసీల్దార్ బి.శ్రీనివాసులు తెలిపారు.

క్రీడాకారులకు సామగ్రి అందజేత



కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి

మర్రిగూడ: క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దారుఢ్యం ఏర్పడుతుందని జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో క్రీడాకారులకు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో క్రీడా కిట్లను జెడ్పీటీసీ పంపిణీ చేశారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించి మంచి పేరు ప్రఖ్యాతుల సంపాదించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్, ఎంపీటీసీలు సిలివేరు విష్ణు, దాసరి మమతగోపాల్, బంతిలాల్, మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య, బచ్చు రామకృష్ణ, లపంగి నరసింహ, కొలుకులపల్లి యాదయ్య, చెరుకు శ్రీరాములు, పందుల పాండుగౌడ్, కొంపల్లి నాగరాజు, పందుల కృష్ణ, వల్లపు సైదులు, మల్లేష్, గంట కృష్ణ, రాజు, జంగయ్య, శివగౌడ్, నడిమింటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు రాజ్యంతోనే పేదలకు న్యాయం

మిర్యాలగూడ అర్బన్ : కమ్యూనిస్టు రాజ్యంతోనే పేదలందరికీ సమన్యాయం దక్కుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు మంగళవారం మిర్యాలగూడ సీపీఎం కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి ఐదో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి జూలకంటి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ వెట్టిచాకిరీ, బానిసత్వానికి గురవుతున్న ప్రజలందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి నిజాంకు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటంలో నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి అగ్రభాగాన నిలిచాడని గుర్తు చేశారు. అనంతరం పట్టణంలోని రవీంద్రనగర్‌లో డాక్టర్ నంద్యాల చరిత, నంద్యాల సృజన ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి రోగులకు మందులను అందజేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రామ్మూర్తి, మంగారెడ్డి, జగదీష్‌చంద్ర, సత్యనారాయణరావు, వీరాచారి, రమేష్, సైదులు, రామకృష్ణ, రామారావు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

చండూరు : తమకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు మోగదాల వెంకటేష్ పాల్గొని మాట్లాడుతూ నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాంపల్లి సైదులు, అన్నెపర్తి చిన్న వెంకన్న, బిపంగి నాగరాజు, నల్లగంటి లింగస్వామి, కళమ్మ, చంద్రమ్మ, ముత్తమ్మ, రేణుక, బక్కమ్మ, అలివేలు, జంగమ్మ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన

నల్లగొండటౌన్: పరిసరాల ప్రభావం పుట్టబోయే బిడ్డపై అధికంగా ఉంటుందని డా.విఠల్‌బాబు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ఆర్య జనని బృందం ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గర్భిణులు సెల్‌ఫోన్ వాడకుండా ఉండాలన్నారు. యోగా, మెడిటేషన్ ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. కార్యక్రమంలో డా.శ్రీవాణి, డీడబ్ల్యూఓ సక్కుబాయి, సీడీపీఓ తుమ్మల నిర్మల, వేదాంత రామకృష్ణ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డా.విఠల్‌బాబు

అభివృద్ధి పనుల పరిశీలన



పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ ముత్తిలింగయ్య

కట్టంగూర్ : మండలంలో పెండింగ్‌లో ఉన్న శ్మశాన వాటిక పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్మశానవాటిక, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పనులను ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశరావుతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. వారం రోజుల్లో పీహెచ్‌సీ భవనం పూర్తవుతుందని అధికారులు వారికి తెలిపారు. వారివెంట ఎంపీఓ సన్ని అబ్రహం, కక్కిరేణి వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

తాటిచెట్టు, కర్రలే విద్యుత్ స్తంభాలు...



ఇప్పలగూడెం శివారులో తాటిచెట్టుకు కట్టిన విద్యుత్ తీగలు



పొలంలో కర్రతో పైకెత్తిన విద్యుత్ తీగలు

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ నుంచి ఇప్పగూడెం వెళ్లే దారి పక్కన పంట పొలాల్లో విద్యుత్ తీగలు మనుషులకు తాకే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ స్తంభాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు పక్కనే ఉన్న తాటిచెట్టును కరెంటు స్తంభంగా మార్చుకున్నారు. కిందకు వేలాడున్న త్రీఫేస్ విద్యుత్ తీగలను పైకి లాగి తాటిచెట్టు వేలాడదీశారు. అక్కడి నుంచి రెండు వందల ఫీట్ల దూరంలో పొలంలో మరో కర్రను పాతి కరెంటు తీగలను పైకెత్తారు. వర్షాలు కురిసినట్లయితే తాటిచెట్టు పూర్తిగా తడిసిపోయి కరెంటు భూమి మీదకు ప్రసరించే అవకాశముంది. ఏమాత్రం గాలివీచినా కర్ర విరిగి తీగలు కిందపడే ప్రమాదం ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి నూతన స్తంభాలు ఏర్పాటుచేసి తీగలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



నల్లగొండటౌన్: స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

నల్లగొండటౌన్: పట్టణంలోని విద్యాగ్రామర్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రజాప్రతినిధుల, ప్రభుత్వ అధికారుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బొల్లం లింగయ్యయాదవ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చండూరు : మున్సిపాలిటీ కేంద్రంలోని గాంధీజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ముఖ్యమంత్రిగా, మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, అధికారులుగా తమ బాధ్యతలను అద్వితీయంగా నిర్వహించారు. చండూరు పట్టణంలో కాన్వాయ్‌తో ముఖ్యమంత్రి పర్యటించి రాజీవ్ గాంధీ, ఇందిరాగాంధీ, మహాత్మా గాంధీ, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాన్వాయ్ వెళ్తున్న క్రమంలో తమకు నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదని కార్మికులు వినతిపత్రం ఇచ్చే సన్నివేశం ఆకట్టుకుంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాళ్లు చెరుపల్లి రామయ్య, సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చండూరు : వేతనాలు అందించాలని సీఎం హోదాలో వ్యవహరించిన విద్యార్థికి వినతి పత్రం అందిస్తున్న కార్మికులు